సాక్షి మంచిర్యాల

మంగళవారం : 6 : జూన్ : 2023



నష్టాల నుంచి లాభాల్లోకి..

ఉమ్మడి జిల్లాలో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ మే నెలలో లాభాల బాట పట్టింది. గత ఏడాది మే నెలతో పోల్చితే రూ.7.87 కోట్ల ఆదాయంతో ప్రగతి చక్రం పరుగులు పెడుతోంది. 8లో▸



ఘనంగా పర్యావరణ దినోత్సవం

జిల్లాలో సోమవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు,అ ధికారులు మొక్కలు నాటి నీళ్లు పోశారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /30.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వేడి గాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

బ్రిడ్జికి మోక్షం !


సోమవారం గోదావరి నదిలో సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

- మంచిర్యాల–అంతర్గాం వంతెన పనుల్లో కదలిక
- ఐదేళ్ల తర్వాత మొదలవుతున్న వంతెన పనులు
- 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల–అంతర్గాంను కలిపేలా గోదావరి నదిపై తలపెట్టిన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంలో మళ్లీ కదలిక వచ్చింది. ఈ నెల 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ స్థలంలో నదిలో భూ పరీక్షలు నిర్వహించారు. నదిలో పిల్లర్లు తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా పిల్లర్లు వేసేందుకు 'ఫైన్ టెస్ట్' చేస్తున్నారు. దీంతో ఏళ్లుగా జాప్యం జరుగుతున్న పనులు మళ్లీ సీఎం రాకతో కొనసాగే అవకాశం ఉంది. ఆ మేరకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా పర్యటనలో సీఎం శంకుస్థాపన చేసే షెడ్యూల్‌లో వంతెన పనులు కూడా ఉన్నాయి.

ఐదేళ్లకు పనులు మొదలు

సీఎం కేసీఆర్ 2018లో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు రోడ్డు రవాణాలో ఇబ్బంది ఎదురవుతున్న దృష్ట్యా గోదావరిపై మరో బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారు. రోడ్డు, భవనాల శాఖ అధికారులు ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.125కోట్లు అవసరం అవుతాయని అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదే ఏడాది మార్చిలో జీవో 170 విడుదలైంది. 'ప్లాన్ ఫర్ వర్క్' పథకం కింద నిధులు కూడా మంజూరు అయ్యాయి. టెండర్లు పిలవకపోవడంతో పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత బ్రిడ్జి నిర్మాణం ఎవరూ పట్టించుకోకపోవడంతో జాప్యం జరిగింది. గతేడాది మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు వంతెన నిర్మాణ జాప్యంపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడం, గోదావరి వంతెన సాధన సమితి పేరుతో అటు అంతర్గాం, ఇటు మంచిర్యాల వైపు నిరసనలు జరిగాయి. 'సాక్షి' ఆధ్వర్యంలోనూ జూమ్ డిబేట్లు నిర్వహించింది. దీంతో ఇక్కడి ప్రజాప్రతినిధుల వినతుల మేరకు ప్రభుత్వం ఎట్టకేలకు గత ఏడాది జూన్‌లో టెండర్లు పిలిచింది. ఏ సంస్థ ముందుకు రాలేదు. రెండోసారి టెండర్లు పిలువగా రెండు కంపెనీలు పోటీ పడి అందులో ఓ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ అంచనాలు రూ.164 కోట్లకు చేరాయి. ఒప్పందం చేసుకున్న సంస్థ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో మళ్లీ బ్రిడ్జి నిర్మాణంపై ఆశలు చిగురించాయి.

తీరనున్న రవాణా కష్టాలు

వాహనాల రాకపోకలతో పెరుగుతున్న రవాణాకు, జాతీయ రహదారుల ఏర్పాటుతో జిల్లాలో రోజు రోజుకు ట్రాఫిక్ విపరీతంగా రద్దీ ఏర్పడుతోంది. ప్రస్తుతమున్న గోదావరి నదిపై ఉన్న ఇందారం వద్ద ఉన్న వంతెనపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దీంతో రోజువారీగా ట్రాఫిక్ పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంచిర్యాల, గోదావరిఖని, ఎన్టీపీసీ మీదుగా కరీంనగర్ వెళ్తుండగా పట్టణాల్లో రద్దీ ఏర్పడడమే కాక భారీ వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నూతన బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తా నుంచి గోదావరి రోడ్ మీదుగా పుష్కర ఘాట్ వద్ద నిర్మించనున్న బ్రిడ్జితో అంతర్గాంకు నేరుగా వెళ్లొచ్చు. రాజీవ్ రాహదారిపై పెద్దపల్లి, కరీంనగర్‌కు వేగంగా సులువుగా రాకపోకలు సాగించవచ్చు. జిల్లాతోపాటు కుమురంభీం, మహారాష్ట్ర, ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వాహనాలకు దూర భారం తగ్గి ఎంతో ఉపయోగకరంగా మారుతుంది. రెండు లైన్లతో దాదాపు కిలోమీటరు మేర నదిపై నిర్మించే ఈ వంతెనతో పారిశ్రామికంగా రామగుండం, మంచిర్యాల మధ్య దూరం తగ్గిస్తుంది. దాదాపు అరగంట సమయం ఆదా అవుతుంది. అంతేకాక రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది.

కేసీఆర్‌తోనే సింగరేణి అభివృద్ధి


సింగరేణి ప్రగతి నివేదిక విడుదల చేస్తున్న ఎంపీ బోర్లకుంట్ల వెంకటేశ్ నేత, డైరెక్టర్ ఎన్.బలరాం

- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత
- శ్రీరాంపూర్‌లో సింగరేణి సంబరాలు

శ్రీరాంపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే సింగరేణి అన్ని రంగాల్లో రికార్డు స్థాయిలో వృద్ధి నమోదు చేసుకుందని, తొమ్మిదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించి దేశ చిత్రపటంపై నిలిచిందని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో సింగరేణి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనేక హక్కులు, సదుపాయాలు కల్పించారని, దేశంలో ఏ పరిశ్రమల్లో లేనంతగా కంపెనీ లాభాల నుంచి 30శాతం వాటా ఉద్యోగులకు చెల్లించారని తెలిపారు. ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న కార్మికులకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను తిరిగి కారుణ్య నియామకాల పేరుతో ఇప్పించడం వల్ల వేలాది మంది పిల్లలకు ఉద్యోగాలు దక్కాయని తెలిపారు. సింగరేణి డైరెక్టర్(పర్సనల్) ఎన్.బలరాం మాట్లాడుతూ ఉద్యోగులకు కంపెనీ లాభాల నుంచి 30శాతం వాటా, పీఎల్ఆర్ బోనస్ అన్నీ కలిపి సుమారు రూ.వెయ్యి కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రూ.21.84కోట్లు లాభాలను ఆర్జించిందని అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. యువకులకు కారుణ్య ఉద్యోగ పత్రాలు, ఉద్యోగులకు ఇంటిరుణం వడ్డీ డబ్బుల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జె శంకర్రావు, బీఎంఎస్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్ సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు భాగ్యరాజ్ పాల్గొన్నారు.

బతుకమ్మ, బోనాలతో ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో నిర్వహించిన సింగరేణి సంబరాలు అంబరాన్నంటాయి. శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని కార్మికుడి విగ్రహానికి డైరెక్టర్(పర్సనల్) యస్.బలరాం, శ్రీరాంపూర్ బి.సంజీవరెడ్డి, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ర్యాలీగా ప్రగతి మైదానం చేరుకున్నారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుస్సాడీ కళాకారుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సింగరేణి సేవా సమితి రెస్క్యూ, ఫారెస్ట్, వర్క్ షాప్ డిపార్టుమెంట్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. విలేజ్ స్టాల్‌లో పూరి గుడిసెలు, చేదబావి, ఎడ్లకొట్టం, తాటిచెట్లు, ఎడ్ల కచ్చురం ఇలా అన్నీ జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఏరియాలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించారు.

న్యూస్‌రీల్

విద్యుత్ కోతలు లేని రాష్ట్రం తెలంగాణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: రైతులకు విద్యుత్ కోతలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రైతులు విద్యుత్ కోసం చాలా సమస్యలు ఎదుర్కొన్నారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమస్య లేకుండా సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కరెంటు సరఫరా చేస్తోందని, రైతుల ఖాతాల్లోకి నేరుగా రైతుబంధు, ధాన్యం డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన డిజిటల్ అభివృద్ధి పనులను ప్రజలకు చూపించారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అన్నం మంగ, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, దండెపల్లి ఎంపీపీ శ్రీనివాస్, విద్యుత్ శాఖ డీసీ స్వామి, ఏఈ గణేష్, నాయకులు అనిల్, గురువయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ పనులు పరిశీలించిన విప్


పనులు పరిశీలిస్తున్న విప్ బాల్క సుమన్

శ్రీరాంపూర్: ఈ నెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సోమవారం పరిశీలించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు యస్.దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి పనులను సందర్శించారు. భవనంలో గదుల్లో జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గార్డెనింగ్, సమావేశ మందిరాన్ని పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ సుదీర్ రామ్‌నాథ్‌కేకన్, అధికారులు పాల్గొన్నారు.

సుదర్శన్ మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ మృతి పీడిత ప్రజలకు తీరని లోటు అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని సుదర్శన్ సోదరుడు కటకం సతీష్‌కుమార్ ఇంటి వద్ద సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుదర్శన్ తన జీవితాన్ని ప్రజా ఉద్యమంలో అంకితం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. చిన్ననాటి నుంచే అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ పేదల పక్షాన పోరాడిన మహోన్నతుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర సమితి సభ్యుడు దాస్, సీనియర్ నాయకులు నర్సయ్య, శ్రీధర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ఎస్టీపీపీ నంబర్ వన్


చెన్నూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విప్ సుమన్

- తెలంగాణ ప్రగతిలో సింగరేణి కీలక భూమిక
- జైపూర్‌లో మరో 800మెగావాట్ల ప్లాంటు
- స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- సింగరేణి సంబురాల్లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్

జైపూర్: విద్యుత్ ఉత్పత్తి(పీఎల్ఎఫ్)లో సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు(ఎస్టీపీపీ) దేశంలోనే నంబర్ వన్‌గా నిలవడం చాలా గొప్ప విషయమని, తెలంగాణ ప్రగతిలో సింగరేణి సంస్థ కీలక భూమిక పోషిస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్లాంటులో సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంబరాలు నిర్వహించారు. జైపూర్ బస్టాండ్ నుంచి ఎస్టీపీపీ ప్రాణహిత అతిథి గృహం వరకు ప్రగతి పరుగు నిర్వహించారు. అతిథి గృహంలో నిర్వహించిన సంబరాలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, సింగరేణి డైరెక్టర్(పీపీ, ఫైనాన్స్) ఎన్.బలరాం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 1200 మెగావాట్ల ప్లాంటు నమూనా స్టాల్స్ ప్రారంభించగా అధికారులు విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను వివరించారు. అనంతరం విప్ సుమన్ మాట్లాడుతూ ఎస్టీపీపీ విస్తరణలో భాగంగా మరో 800మెగావాట్ల పవర్ ప్లాంటు త్వరలో నిర్మించుకోబోతున్నామని, తొమ్మిది ప్రభావిత గ్రామాల్లోని నిరుద్యోగులు, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఇప్పటికే స్థానికులు 800మంది పని చేస్తున్నప్పటికీ మరో 400నుంచి 500మందికి ఉద్యోగాలు కల్పించాలని డైరెక్టర్ బలరాంను కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు పెంచాలని అన్నారు. అనంతరం గుస్సాడీ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం సూర్యనారాయణ రాజు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, పీసీ ఎస్ జీఎం రమణ, టీబీజీకేఎస్ సెంట్రల్ మెంబర్ ఎన్‌జీ.రాజు, సీఎంవోఏఐ సెంట్రల్ ఉపాధ్యక్షులు సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం సత్యనారాయణప్రసాద్, సుధాకర్, శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ నారాయణరావు, పీఎం రామశాస్త్రి పాల్గొన్నారు.

గణనీయమైన అభివృద్ధి

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గం విద్యుత్ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో రూ.1.90 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సంతోషిమాత ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన విద్యుత్ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సీఈ కేఎస్ గుట్టా, ఎస్ఈ శేషారావు, డీఈ పెద్ది రాజన్, డీఈ రడీవో శేషాద్రి, ఏడీలు రవికుమార్, విలాస్, వెంకటేశ్వర్లు, తిరుపతి, రాజశేఖర్, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్లు నసీమా బేగం, జగన్నాధుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, వైఎస్ ఎంపీపీ బాపురెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాం

రామకృష్ణాపూర్: రాష్ట్రం ఏర్పడ్డాక విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. రామకృష్ణాపూర్‌లో పట్టణంలోని శివాజీనగర్ ఏరియాలో రూ.1.90 కోట్లతో నిర్మించిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, పట్టణ ఇన్‌చార్జ్ గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

పర్యాటకంపై పట్టింపేది

- కళకళలాడుతున్న గోదావరి
- హామీగానే మిగిలిన బోటింగ్
- పర్యాటక శోభ కనుమరుగు
- ఆదాయం కోల్పోతున్న బల్దియా


బోటింగ్‌కు అనువుగా ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో కళకళలాడుతున్న గోదావరి నది

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట సమీపంలో గోదావరిలో బోటింగ్ కలగానే మిగిలిపోతోంది. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో కళకళలాడుతున్న గోదావరి నది బోటింగ్ లేకపోవడంతో పర్యాటకంగా కళ తప్పింది. గోదావరి నది అవతలివైపు ఉన్న కోటిలింగాల దేవస్థానానికి వెళ్లేందుకు బోటింగ్ లేకపోవడంతో సుమారు 20 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. గోదావరి పుష్కరాల సమయంలో నదిని సందర్శించిన ప్రజాప్రతినిధులు బోటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, హామీ నెరవేర్చడంపై శ్రద్ధ చూపడం లేదు. టూరిజం డెవలప్‌మెంట్ శాఖ నిర్లక్ష్యంతో లక్సెట్టిపేట మున్సిపాలిటీ కూడా ఆదాయం కోల్పోతోంది.

అటకెక్కిన స్పీడ్ బోటింగ్..

గతేడాది స్పీడ్ బోటింగ్‌ను ప్రారంభించారు. అయితే రెండు నెలలకే దానిని అటకెక్కించారు. బోటింగ్ ఏర్పాటు చేయాలంటే జెట్టీ నిర్మాణం చేపట్టాలి. ప్లాట్‌ఫారం, సందర్శకులు వేచి ఉండే గదులు, టికెట్ కౌంటర్, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఈ సౌకర్యాలన్నీ కల్పించేందుకు అనుకూలంగా ఉన్నా.. అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సౌకర్యాలు కల్పించి రెండు బోట్లు ఏర్పాటు చేస్తే పర్యాటకులకు సౌకర్యంగా ఉండడంతోపాటు మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు.

బోటింగ్ ఏర్పాటు చేయాలి



గోదావరి నది వద్ద బోటింగ్ ఏర్పాటు చేయాలి. పట్టణవాసులు వేసవి సెలవుల్లో ఎటూ వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటక శాఖ అధికారులు పట్టించుకుని గోదావరి నదిలో బోటింగ్ ఏర్పాటు చేస్తే ఆహ్లాదకరంగా ఉంటుంది. కోటిలింగాల వెళ్లే భక్తులకు దూర భారం తగ్గుతుంది.

– ఏలేశ్వరం గౌతం లక్సెట్టిపేట

నిధులు రాలేదు



బోటింగ్ ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. మున్సిపల్‌కు ఆదాయం వస్తుంది. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. బోటింగ్ ఏర్పాటు చేస్తే అన్నివిధాలా బాగుంటుంది. కోటిలింగాల దేవస్థానానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– ఆకుల వెంకటేష్
మున్సిపల్ కమిషనర్ లక్సెట్టిపేట

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పూర్తిస్థాయి సౌకర్యాలతో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని డీఈఓ యాదయ్య పిలుపునిచ్చారు. సోమవారం హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామవీధుల్లో విద్యార్థులతో కలిసి చదువుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. విద్యార్థులందరికీ ఈ నెల 12లోపు యూనిఫాం సిద్ధం చేయాలని ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంచాల శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ గుర్రపు రాజన్న, ఎస్ఓలు చౌదరి, సత్యమూర్తి, ఎంఈఓ పోచయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బడిబాటలో డీఈఓ యాదయ్య

అంబరాన్నంటిన క్రీడా సంబరం

- రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం
- ఎనిమిది జిల్లాల జట్లు హాజరు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మరో రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఎనిమిది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు అంతర్జాతీయ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వివిధ జిల్లాల జట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల కెప్టెన్లతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో గెలుపోటములను లెక్కచేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు సంజయ్, ఈశ్వరాచారీ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జట్టు శుభారంభం..

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య మంచిర్యాల జట్టు శుభారంభం చేసింది. ఉదయం నిర్వహించిన పోటీల్లో కోర్ట్ నంబరు–2లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో వనపర్తి జిల్లాపై మంచిర్యాల జట్టు 4–0 గోల్స్‌తో విజయం సాధించింది. మరో లీగ్‌లో నిజామాబాద్ జట్టు మహబూబ్‌నగర్‌పై 6–0 గోల్స్‌తో గెలుపొందింది. కోర్ట్ నెంబర్–1లో జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు రంగారెడ్డిపై 2–0 గోల్స్‌తో, మెదక్ జట్టు ఖమ్మంపై 1–0 గోల్స్‌తో గెలుపొందాయి. పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.


పోటీలకు హాజరైన వివిధ జిల్లాల జట్ల క్రీడాకారులు

క్లుప్తంగా

వందేభారత్ ట్రయల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న రైలు

కాగజ్‌నగర్‌టౌన్: సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు సోమవారం వందేభారత్ రైలు ట్రయల్ రన్ విజయవంతమైంది. గత ఆరునెలల క్రితం, ప్రస్తుతం రెండోసారి ట్రయల్ రన్ విజయవంతమైనట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే అధికారికంగా ఆ రైలును నడిపించేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతున్నట్లు వివరించారు. కాగా, ఏ రైల్వేస్టేషన్‌లోనూ వందేభారత్ రైలును ఆపకుండా ట్రయల్ రన్ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న జడ్జి సంపత్

చెన్నూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, చెట్లను నరికివేయకుండా ప్రకృతిని కాపాడాల్సి అవసరం ఉందని చెన్నూర్ న్యాయమూర్తి సంపత్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవా అధికార సంస్థ అధ్వర్యంలో మొక్కలు నాటారు. జడ్జి మాట్లాడుతూ అడవులు అంతరించిపోతే పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. మానవ మనుగడకు వన సంపద ఎంతో మేలు చేస్తుందని, మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై సౌజన్య, ఏజీపీ రాంబావు, ఫారెస్ట్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అడవులను రక్షించాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి హఫీజోద్దీన్

జన్నారం: పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దామని రేంజ్ అధికారి హఫీజోద్దీన్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వస్తువులను ఏరివేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి, స్థానికులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల వాతావరణం కాలుష్యం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మొక్కలను విరివిగా పెంచాలని, అడవులను రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు రవి, బీట్ అధికారులు పాల్గొన్నారు.

గనులపై సింగరేణి సంబురాలు



కాసిపేటగనిపై బతుకమ్మలు, బోనాలతో మహిళలు

కాసిపేట: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట2 గనులపై సోమవారం సింగరేణి సంబురాలు నిర్వహించారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులు జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. తెలంగాణ తల్లి, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకున్నారు. బతుకమ్మ ఆట ఆడిపాడారు. పలువురు పోతరాజుల నృత్యాలు, తెలంగాణతల్లి వేషధారణలతో ఆకట్టుకున్నారు. కాసిపేట గనిపై గ్రూఫ్ అఫ్ ఏజెంటు ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ అవశ్యకతను వివరించారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో సింగరేణి అభివృద్ధి అభినందనీయమన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, రక్షణాధికారి సునిల్ కుమార్, స్వేరోస్ రాష్ట్ర కో కన్వీనర్ బన్న లక్ష్మణ్‌దాస్, టీబీజీకేఎస్ నాయకులు ఉన్నారు. కాసిపేట2 గనిపై వద్ద జరిగిన సంబురాల్లో మేనేజర్ లక్ష్మీనారాయణ, రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సులు

నష్టాల నుంచి లాభాల్లోకి..

- ఆర్టీసీకి కలిసొచ్చిన వేసవి సెలవులు
- శుభకార్యాలు, విహారయాత్రలకు నడిపిన బస్సులు

మంచిర్యాలఅర్బన్: **నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థ మే నెలలో లాభాల బాట పట్టింది. గతేడాది మే నెలతో పోల్చితే రూ.7.87 కోట్ల ఆదాయంతో ప్రగతి చక్రం ముందుకు సాగింది. వేసవి సెలవులు ఆర్టీసీకి కలిసివచ్చింది. ఉమ్మడి జిల్లాలో మే నెలలో 78లక్షల 30వేల కి.మీ మేర బస్సులు తిప్పగా గతేడాది కంటే రూ.7.87 కోట్లు లాభాలు వచ్చాయి. ఇతర నెలలతో పోల్చితే మేలో ఆర్టీసీకి ఆదాయం వస్తుందని అంచనా వేసిన ఆర్టీసీ అందుకు తగినట్లుగా బస్సులు తిప్పింది. పెళ్లిళ్లు, విహారయాత్రలు శుభకార్యాలు నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం బస్సులను నడపటంతో ఆశించిన మేర లాభాలు వచ్చాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు.**

మే నెలలో ఆదాయం (రూ.కోట్లలో)

డిపో	2022	2023
ఆదిలాబాద్	6.45	8.06
భైంసా	3.18	4.05
నిర్మల్	7.19	8.96
ఉట్నూర్	1.11	1.56
ఆసిఫాబాద్	3.40	4.41
మంచిర్యాల	16.80	18.52
మొత్తం	27.74	35.61

(మే నెలకు సంబంధించి)

డిపో	ఓఆర్ 2022	తిప్పిన బస్సులు 2023	కిలోమీటర్లు (లక్షల్లో) 2022	2023
ఆదిలాబాద్	79	74	16.51	17.11
భైంసా	79	71	8.91	9.52
నిర్మల్	79	72	18.21	19.44
ఉట్నూర్	81	62	3.17	3.72
ఆసిఫాబాద్	74	69	9.37	9.99
మంచిర్యాల	78	71	16.80	18.52

ఓఆర్ తగ్గినా పెరిగిన ఆదాయం..

గతేడాది మే నెలతో సరిచూస్తే ఈ ఏడాది ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) తగ్గిపోయింది. గతేడాది 78 ఓఆర్ ఉండగా, ఈ ఏడాది 71 పడిపోయిన ఆదాయంపై ప్రభావం పడలేదు. ఆదిలాబాద్ డిపో 74 శాతం ముందు వరుసలతో నిలిచింది. నిర్మల్ డిపో 72 శాతంతో రెండో స్థానం నిలవగా, భైంసా డిపో, మంచిర్యాల 71 శాతంతో మూడో స్థానానికి పరిమితమైంది. ఆదిలాబాద్ రీజియన్‌వ్యాప్తంగా ఈ ఏడాది మే నెలలో 78 లక్షల 30 వేల కి.మీ మేర బస్సులు నడిపి 71శాతం ఓఆర్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత మే నెలతో పోల్చితే ఈ ఏడాది ముందు వరుసలో నిలిచిన ఆదిలాబాద్, నిర్మల్ డిపో 3 శాతం, మంచిర్యాల 6 శాతం వెనకబడిపోవటం గమనార్హం. గతేడాది 72 లక్షల 96 కి.మీ బస్సులు నడపగా ఈ ఏడాది 78 లక్షల 30 వేల కి.మీ మేర బస్సులు తిప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా అనుకున్నమేర కంటే ఆదాయం గడిచింది.

పెరిగిన ఈపీకే..

ప్రతి కిలోమీటర్‌కు వచ్చిన ఆదాయం పోల్చితే ఈ ఏడాది మే నెలలో ఆశించిన దానికంటే మెరుగ్గానే ఉంది. రీజియన్‌లో చూస్తే గతేడాది మే నెలలో 38.03 ఎర్నింగ్ ఫర్ కిలోమీటర్ (ఈపీకే) కాగా, ఈసారి 45.48 మేర ఈపీకేతో ఆర్టీసీ దూసుకెళ్లింది. ఆదిలాబాద్ 47.12, నిర్మల్ డిపో 46.10, మంచిర్యాల 46.11 ఈపీకేతో మూడో స్థానానికి పరిమితమైంది. కుమురంభీం ఆసిఫాబాద్ 44.24, భైంసా 42.62, ఉట్నూర్ డిపో 42.10తో ఈపీకేలో తర్వాత స్థానం నిలిచాయి. గతేడాది మేనెలతో పోల్చితే మాత్రం 7.45 ఈపీకేతో అదనం లాభాలు గడిచింది.

'ఎన్నికలకు సిద్ధం కావాలి'



కండువా కప్పుతున్న రఘునాథ్

జన్నారం: త్వరలో జరిగే ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలు, నాయకులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెర్రబెల్లి, పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారం లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం పలువురు బీజేపీలో చేరగా, వారికి కండువా కప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మండల అధ్యక్షుడు గోలి చందు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి నాయక్, నాయకులు తిరుపతి నాయక్, మధుసూదన్‌రావు, లక్ష్మణ్, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి



గేదె మృతదేహం

తిర్యాణి: విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతిచెందాయి. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి జెడ్పీ పాఠశాల వెనుక నుంచి పొలాలకు వెళ్లేదారిలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కీర్తి మహేశ్‌కు చెందిన రెండు గేదెలు ఆ తీగలను తగలడంతో మృతిచెందాయి. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో కరెంట్ సరఫ రాను నిలిపివేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని మహేశ్ వేడుకున్నారు.

భూగర్భజలాల పెంపు లక్ష్యంగా..



కన్నెపల్లిలో చెరువుకట్ట పనులు చేస్తున్న కూలీలు

- అమృత్ సరోవర్ పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్రం
- చెరువులు, కుంటల మరమ్మతు, కొత్త నిర్మాణాలు
- ఉపాధి పథకం ద్వారా పనులు

పాతమంచిర్యాల: వాన నీటిని ఒడిసి పట్టి, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ సరోవర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పల్లెల్లో చెరువులు, కుంటల మరమ్మతులు, కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వాటిని చేర్చారు. జిల్లాలో 140 చెరువులు అభివృద్ధి చేయాలని అధికారులు గతేడాది గుర్తించారు. పాత చెరువుల్లో పూడికతీత పనులు, చెరువు కట్ట నిర్మాణాలను చేపట్టారు. ఇప్పటికే 58 చెరువుల పనులు పూర్తికాగా, 80 చెరువుల పనులు ఆగస్టు 15 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా చెరువుల వద్ద జాతీయ జెండా ఆవిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తయ్యాక చెరువుల కట్టలపై, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటనున్నారు.

ఆగస్టు వరకు పనులు పూర్తిచేస్తాం

చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఆగస్టు వరకు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. నిర్మాణాలు పూర్తయితే చెరువుల వద్ద పంద్రాగస్టు రోజున జాతీయ జెండా ఆవిష్కరిస్తాం.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



వాలీబాల్ కిట్లతో ఆదివాసీ యువకులు, అటవీశాఖ అధికారులు

కాసిపేట: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని బెల్లంపల్లి రేంజ్ ఎఫ్ఆర్వో ఏ.సుభాష్ పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంకటపూర్‌లో ఆదివాసీ యువకులకు సోమవారం అడవుల రక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం అడవులను రక్షించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధించి, పర్యావరణ సమతుల్యతకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల19న నిర్వహించే హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆదివాసీ యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, ఆదివాసీ నాయకులు ప్రభాకర్, మల్లేశ్, భీంరావు, వాచర్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ డీడీ డా.దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలను శాఖల వారీగా పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని ఆదిలాబాద్ మండల పిప్పలాదరి గ్రామానికి చెందిన ఆత్రం అయ్యు, జంగు విన్నవించారు.
- తనకు ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్ మండలం హనుమాన్‌నగర్‌కు చెందిన సట్ల మమత వేడుకుంది.
- ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కుడిమెతగంగాసాగర్ అర్జీ సమర్పించాడు.
- తనకు వికలాంగుల ట్రైసైకిల్, ఇల్లు మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం శంకర్‌నాయక్ తండాకు చెందిన జె.మమత కోరింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- అతివేగంగా బైక్ ను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి



హుస్సేన్ (ఫైల్)


బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ఐటీడీఏ తోట సమీపం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతిచెందాడు. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేద్కర్ రడగంబాల బస్తీకి చెందిన ఎండీ హుస్సేన్(40) పాత ఇనుప సామగ్రి కొనుగోలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీగా సోమవారం సాయంత్రం తన బైక్‌పై బెల్లంపల్లి నుంచి గురిజాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కన్నెపల్లి నుంచి బెల్లంపల్లికి వస్తున్న కారు బైక్‌ను ఎదురుగా వేగంగా ఢీకొంది. ఒక్కసారిగా హుస్సేన్ కిందపడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారును అక్కడే వదిలి డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని హుస్సేన్ మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

27న పాలిటెక్నిక్ సీట్ల భర్తీ

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో కంపెనీ కోటా సీట్లను ఈ నెల 27న కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు 150 సీట్లను కేటాయిస్తామన్నారు. పాలిసెట్–2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని, సివిల్ 30, కంప్యూటర్స్ 30, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ 30, మెకానికల్ 30, మైనింగ్ 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 5 నుంచి 23 వరకు కంపెనీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుఫారంపై విద్యార్థుల తల్లిదండ్రులు పనిచేసే గని ముఖ్యఅధికారితో సంతకం చేయించుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

సాగునీటి కల సాకారం..!

- చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి మోక్షం
- 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- 90 వేల ఎకరాలకు సాగునీరు



సాగునీరందించే చెన్నూర్ లిఫ్ట్ డీపీఆర్

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ ప్రజల సాగునీటి కల సాకారం కానుంది. తలాపునే గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నా చుక్క నీరు రాక వేలాది ఎకరాల భూములు సాగుకు నోచుకోలేదు. వర్షాధార పంటలపైనే ఆధారపడి సాగు చేసిన రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టాల పాలయ్యారు. పక్కనే ఉన్న గోదావరి జలాలు అందుబాటులోకి వస్తే భూములు సస్యశ్యామలం అవుతాయని ఎన్నో ఏళ్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతుల కలలు నిజమయ్యే రోజులు దగ్గరకు వచ్చాయి. కాళేశ్వరం జలాలను ఎత్తిపోతల ద్వారా తెచ్చి బీడు భూములకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.1658 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

మహర్దశ

నియోజకవర్గంలో సాగుకు మహర్దశ రానుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి చెన్నూర్ ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 90వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు ఈ నెల 9 ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. ఎడారిగా మారిన నియోజకవర్గంలోని భూములకు నీరందనుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయమే జీవనాధారం

నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే పంటలు పండుతాయి. ఈ ప్రాంత రైతాంగ స్థితిగతులను అధ్యయనం చేసిన ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ కాళేశ్వరం నీళ్లు తీసుకు రావడమే లక్ష్యంగా కృషి చేశారు. ఆయన కృషి ఫలించి ఎత్తిపోతల పథకం మంజూరైంది.

నియోజకవర్గంలో..

నియోజకర్గంలోని 103 గ్రామాల్లో 90 వేల ఎకరాలకు మూడు లిఫ్ట్‌ల ద్వారా నీరందిస్తారు. ఐదు మండలాలలోని సుమారు 304 చెరువులు, కుంటలకు నీరు చేరితే రెండు పంటలకు అవసరమయ్యే సాగునీరు పుష్కలంగా లభ్యమవుతుందని అధికారులు అంటున్నారు.

మూడు ఎత్తి పోతలు ఇలా

లిఫ్ట్...1 సుందిళ్ల బ్యారేజీ

మండలం	గ్రామాలు	ఎకరాలు
జైపూర్	21	19,988
మందమర్రి	6	5,335
మొత్తం	27	25,423

లిఫ్ట్ -2 అన్నారం బ్యారేజీ

మండలాలు	గ్రామాలు	ఎకరాలు
చెన్నూర్	30	31,947
భీమారం	13	10,606
కోటపల్లి	9	5654
మొత్తం	52	48, 207

లిఫ్ట్ -3 మేడిగడ్డ బ్యారేజీ

కోటపల్లి	24	16371
నియోజకవర్గంలో	103 గ్రామాలు	90,000

మూడు లిఫ్ట్‌ల ద్వారా..

గత ఫిబ్రవరిలో చెన్నూర్ లిఫ్ట్ సర్వే కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.6.88 కోట్లు మంజూరు చేశారు. సర్వేతోపాటు డిటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ పూర్తయింది. దీంతో చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి రూ.1658 కోట్లు మంజూరయ్యాయి. మూడు లిఫ్ట్‌ల ద్వారా 90 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

ప్రజల చిరకాల వాంఛ..



చెన్నూర్ నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ తీరనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ ప్రజలపై మమకారంతో చెన్నూర్ లిఫ్ట్‌కు రూ.1658 కోట్లు మంజూరు చేశారు. రెండు పంటలకు పుష్కలంగా నీరందుతుంది. ఈ ప్రాంత పంట పాలాలు సస్యశ్యామలం కానున్నాయి.

–బాల్క సుమన్, ప్రభుత్వ విప్

వడదెబ్బతో ఒకరి మృతి?



అశోక్‌కుమార్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ హనుమాన్ బస్తీకి చెందిన ఎర్రోజ్ అశోక్ కుమార్(40) బంగారు ఆభరణాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతకొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇదే క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 1న ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రెండు రోజుల తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, ఇతర ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. సోమవారం బెల్లంపల్లిలోని పోచమ్మ చెరువు సమీపంలోని ముళ్లపొదల్లో ఉన్న మృతదేహాన్ని అశోక్‌గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అక్కడి చేరుకుని పంచనామా నిర్వహించారు. అశోక్‌కు అనారోగ్యం ఉండడం, తిండి తినపోకవడంతో వడదెబ్బకు గురై మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడికి భార్య లావణ్య, పదేళ్ల కుమారుడు మణికంఠ, ఆరేళ్ల కుమార్తె శివాణి ఉన్నారు. భార్య, కుటుంబీకుల పిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి ఒడ్డున మొసలి సంచారం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున మొసలి సంచరిస్తోంది. సామిల్ వెనుకాల నీటి గుంత పక్కన మూడు రోజులుగా మొసలి సంచరిస్తూ జాలరుల కంట పడింది. అటు వైపు నుంచి గోదావరికి చేపల వేటకు వెళ్లే వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో మొసలి సంచారం విషయం వైరల్‌గా మారింది. ఫారెస్టు అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.